ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 3
కృష్ణా జిల్లా వార్తలు
సోమవారం 19 మే 2025

ఉపాధిలో అవినీతిపై చర్యల్లేవ్!

గ్రామాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

ఎస్ఎన్ గొల్లపాలెంలో సస్పెన్షన్‌కు గురైనా.. అతనితోనే మళ్లీ పనులు

- సుల్తానగరంలో పనిచేసేది 50 మంది.. లెక్కల్లో చూపేది 250 మంది!
- మచిలీపట్నం, గూడూరు మండలాల్లో అక్రమాలు చేసిన టెక్నికల్ అసిస్టెంట్‌ను కాపాడే ప్రయత్నం
- గ్రామసభల్లో అధికారులు విచారణ జరిపి నివేదికలు ఇచ్చినా చర్యలు శూన్యం
- నిందితుల నుంచి నగదు రికవరీలో నిర్లక్ష్యం



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. 50 మంది పనిచేసిన చోట 250 మంది చేసినట్టు లెక్కల్లో చూపి భారీగా దోచుకుంటున్నారు. గ్రామస్థుల ఫిర్యాదులు, గ్రామ సభల్లో విచారణలో అక్రమాలు నిజమేనని తేలినా చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. వారినే మళ్లీ విధుల్లో కొనసాగిస్తూ అవినీతిని ప్రోత్సహిస్తున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం మండలం ఎస్ఎన్ గొల్లపాలెంలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి పనుల్లో పలు అక్రమాలకు పాల్పడ్డాడు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా కలెక్టర్‌కు అన్ని ఆధారాలతో ఫీల్డ్ అసిస్టెంట్ నిర్వాకంపై గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. అధికారులు విచారణ చేసిన సమయంలో ఈ ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామానికి చెందిన, లేవలేనిస్థితిలో ప్రభుత్వం నుంచి నెలనెలా రూ.15వేల సామాజిక పింఛను తీసుకుంటున్న మహిళతో పాటు గ్రామంలో లేని వారి పేరున జాబ్ కార్డులు ఇచ్చి పనులు చేసినట్లుగా రుజువైంది. రూ.1.70 లక్షలకుపైగా అక్రమాలు జరిగినట్టుగా అధికారులు ప్రాథమిక విచారణలో తేల్చారు. దీంతో సదరు ఫీల్డ్‌అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు. అయితే ఈ ఫీల్డ్‌అసిస్టెంట్ గత వారం రోజులుగా మళ్లీ ఉపాధి కూలీలతో పనులు చేయిస్తున్నారు. ఈ విషయంపై గ్రామస్థులు శనివారం డ్వామా కార్యాలయానికి వెళ్లి సస్పెండ్ అయిన ఫీల్డ్‌అసిస్టెంట్‌తో ఎలా పనిచేయిస్తున్నారని, ఎవరి లాగిన్‌లో నుంచి కూలీల వివరాలు అతను నమోదు చేస్తున్నాడని, అతన్ని మళ్లీ విధుల్లోకి తీసుకున్నారా అనే అంశంపై సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరారు. దీంతో డ్వామా కార్యాలయ అధికారులు ఎస్ఎన్ గొల్లపాలెం ఫీల్డ్‌అసిస్టెంట్‌ను విధుల్లోకి తీసుకుంటూ తమ కార్యాలయం నుంచి ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని, ఎంపీడీవో కార్యాలయంలో వివరాలు తెలుసుకోవాలని చెప్పి పంపేశారు. గ్రామస్థులు ఎంపీడీవో కార్యాలయంలో సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు ఇవ్వాలని అర్జీ అందజేశారు.

సుల్తానగరంలో ఫీల్డ్ అసిస్టెంట్ తీరుపై సర్వత్రా విమర్శలు

మచిలీపట్నం మండలం సుల్తానగరంలో ఫీల్డ్ అసిస్టెంట్ తీరుపై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ గ్రామంలో ప్రస్తుతం రోజుకు 50 మంది ఉపాధి కూలీలు పనిచేస్తుంటే.. 250 మందికి పైగా పనులు చేస్తున్నట్లుగా ఫీల్డ్ అసిస్టెంట్ నమోదు చేస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఈ ఫీల్డ్ అసిస్టెంట్ చేస్తున్న అక్రమాలపై పూర్తి వివరాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు గ్రామస్థులు సిద్ధమవుతున్నారు. మచిలీపట్నం మండలంలోని చిన్నాపురం పంచాయతీలో ఫీల్డ్‌అసిస్టెంట్‌గా మహిళ పనిచేస్తున్నట్లుగా అధికారికంగా ఉంది. కానీ ఆమె ఐదేళ్ల క్రితమే వివాహం చేసుకుని వేరే గ్రామంలో ఉంటోంది. ఈ మహిళ తండ్రి తన కుమార్తె పేరుతో ఉపాధి హామీ పనులు చేయిస్తున్నాడు. ఇతను చేసిన అక్రమాలపై గ్రామస్థులు 90 పేజీలతో కూడిన వివరాలతో అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు విచారణ చేసిన సమయంలో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. అయినా ఫీల్డ్ అసిస్టెంట్‌గా అనధికారికంగా అతడినే అధికారులు కొనసాగించడంపై గ్రామస్థులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

రెండు మండలాల్లో అక్రమాలకు పాల్పడినా!

మచిలీపట్నం, గూడూరు మండల పరిషత్ కార్యాలయాల్లో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేసిన ఉద్యోగి పలు అక్రమాలకు పాల్పడినట్టు అధికారుల విచారణలో వెల్లడైంది. మచిలీపట్నం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ తన స్వగ్రామమైన వాడపాలెంలో తన కుటుంబసభ్యులు, బంధువుల పేరుతో రెండేసి జాబ్ కార్డులను టెక్నికల్ అసిస్టెంట్ సృష్టించాడు. హైదారాబాద్, ముంబయిలో ఉంటున్న వారి పేర్లతో జాబ్‌కార్డులు తయారు చేయించాడు. గ్రామంలో ఉన్న వారు, ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు పనిచేయకున్నా చేసినట్లుగా చూపి నగదును కాజేశాడు. వాడపాలెం గ్రామాన్ని కేంద్రంగా చేసుకుని ఈ ఉద్యోగి చేసిన అక్రమాలపై అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో అధికారులు విచారణ చేసి పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందించారు. వైసీపీ మిగతా 4లో..

ట్రాన్స్‌కోనా మజాకా!

విద్యుత్‌శాఖ అధికారుల వ్యవహారశైలి అనేక విమర్శలకు దారితీస్తోంది. ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే విజయవాడ ఎయిర్ పోర్టులో 132/32 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టారు. పనులు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో తాపీగా ప్రజాభిప్రాయ సేకరణ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీనిపై ఎవరైనా అభ్యంతరం వ్యక్తం చేసినా, కోర్టును ఆశ్రయించినా పనులు నిలుపుదల చేయాల్సిన పరిస్థితి వస్తుంది. ఇదే కాక గతంలో గన్నవరం పాత సబ్ స్టేషన్ పక్కన కోట్ల రూపాయలతో కొత్త స్టేషన్ నిర్మించారు. ప్రారంభం కూడా చేయకుండా వదిలేశారు. మేథా టవర్ సమీపంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టి.. వెంటనే పనులు ఆపేశారు. ఇప్పుడు మూడో సబ్‌స్టేషన్ పనులు నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్నారు.

ఎయిర్‌పోర్టులో చురుగ్గా 132/32 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు

ఇప్పుడు తాపీగా ప్రజాభిప్రాయ సేకరణ నోటిఫికేషన్ విడుదల

- పనులు ప్రారంభానికి ముందే ఇవ్వాల్సిన నోటిఫికేషన్ తర్వాత ఇవ్వడంపై విమర్శలు
- ఇప్పటికే ఒక సబ్ స్టేషన్ నిర్మించి పాడుబెట్టారు.. మరోదానికి పనులు ప్రారంభించి వదిలేశారు!
- తాజాగా మూడో దాన్ని నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారు..
- విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు


గన్నవరం ఎయిర్‌పోర్టులో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గన్నవరంలోని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో నిర్మిస్తున్న 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు సంబంధించి ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనల కోసం ఈ నెల 13వ తేదీన గజిట్ నోటిఫికేషన్‌ను విద్యుత్ శాఖ అధికారులు విడుదల చేశారు. వాస్తవంగా ఈ గజిట్ నోటిఫికేషన్‌ను మిగతా 4లో..


రైల్వేట్రాక్‌పై పడిన ట్రాలీని తొలగిస్తున్న సిబ్బంది

రైల్వే స్టేషన్‌లో వర్షం ఇక్కట్లు

ప్లాట్‌ఫాంలపై ధారలా కారిన నీరు

- లగేజీ సహా తడిచిపోయిన ప్రయాణికులు
- ట్రాక్‌పై పడిన పార్శిల్ ట్రాలీ
- రైళ్లు రాకపోవడంతో తప్పిన ప్రమాదం

రైల్వేస్టేషన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఏ1 రైల్వేస్టేషన్‌గా పేరొందిన విజయవాడ రైల్వేస్టేషన్ పరిస్థితి దారుణంగా తయారైంది. ఆదివారం సాయంత్రం జోరుగా కురిసిన వర్షానికి రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంల షెడ్లకు రంధ్రాలు పడి నీరు ధారలుగా కారింది. కనీసం ప్లాట్‌ఫాంపై ప్రయాణికులు నిలబడే పరిస్థితి కూడా లేకుండాపోయింది. కొన్నిచోట్ల వర్షపునీరు ప్రయాణికులపై పడటంతో లగేజీ సహా తడిచిపోయారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా ఇటీవల రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు చేపట్టారు. పనులు కొనసాగుతున్నాయి. అయితే, ప్లాట్‌ఫాంలపై ఉన్న షెడ్లకు ఉన్న రంధ్రాలను మాత్రం ఎవరూ గుర్తించలేదు. ఈ స్టేషన్ నుంచి నిత్యం వేలమంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇంత ప్రధానమైన స్టేషన్‌లో ప్లాట్‌ఫాంలపై వర్షం కురవటం ప్రయాణికులను ఆందోళనకు గురిచేసింది.

ట్రాక్‌పై పడిన ట్రాలీ

రైల్వే ప్లాట్‌ఫాంలపై ట్రాలీలు, తోపుడు బండ్లు నిలపరాదనే నిబంధన ఉంది. అయినప్పటికీ కొందరు కాంట్రాక్టర్లు తమ వాహనాలను ప్లాట్‌ఫాంలపై నిలుపుతున్నారు. ఆదివారం సాయంత్రం భారీగా గాలివాన రావటంతో ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంపై ఉంచిన ట్రాలీ కొట్టుకుపోయి ట్రాక్‌పై పడింది. దీంతో ప్రయాణికులు కొద్దిసేపు భయాందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న స్టేషన్ అధికారులు.. సిబ్బంది సహకారంతో ట్రాలీని ప్లాట్‌ఫాంపైకి తీసుకొచ్చారు. ఈ సమయంలో ప్లాట్‌ఫాంపై రైళ్లు రాకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది.


ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంలో ధారలుగా కారుతున్న వర్షపు నీరు

వంశీని వెంటాడుతున్న పీటీ వారెంట్లు



ఒక కేసులో బెయిల్ వచ్చే లోగా మరో కేసు రెడీ

తాజాగా తెరపైకి అక్రమ మైనింగ్ కేసు పీటీ వారెంట్

త్వరలో కోర్టులో దాఖలు చేసే అవకాశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను పీటీ వారెంట్లు వెంటాడుతున్నాయి. ఒక కేసులో బెయిల్ మంజూరవుతుందనే సరికి మరో కొత్త కేసు చుట్టుకుంటోంది. బెయిల్ వస్తుందని ఆశలు రేకెత్తే సమయానికి పోలీసులు పీటీ వారెంట్లను పైకి తీస్తున్నారు. ఇప్పటికే వివిధ కేసుల్లో అరెస్టయిన వంశీ విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో బెయిల్ వచ్చే సమయానికి నకిలీ ఇళ్లపట్టాల కేసు చుట్టుకుంది. ఆ తర్వాత వెంటనే గన్నవరం, బాపులపాడు మండలాల్లో జరిగిన అక్రమ మైనింగ్ కేసు సిద్ధమైంది. గన్నవరంలో వంశీ బినామీ పేర్లతో అనుమతులు తీసుకుని అక్రమ మైనింగ్ చేశారని, తద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.195కోట్ల నష్టం వాటిల్లిందని భూగర్భ గనుల శాఖ అధికారులు గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. వరుస కేసులతో వంశీ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆరు కేసుల్లో మిగతా 4లో..

తెరపైకి వస్తున్న పెండింగ్ కేసులు

ఆ తర్వాత నుంచి పెండింగ్‌లో ఉన్న అన్ని కేసుల్లోనూ పీటీ వారెంట్లను సిద్ధం చేశారు. గన్నవరంలో హైకోర్టు న్యాయవాది స్థలాన్ని కబ్జా చేసిన కేసులో కొద్దిరోజుల క్రితమే బెయిల్ మంజూరైంది. తర్వాత తాజాగా టీడీపీ కార్యాయలంపై దాడి కేసు, సత్యవర్ధన్ కిడ్నాప్ కేసుల్లో బెయిల్ వచ్చింది. ఒక్కో కేసులో బెయిల్ వస్తున్నా బయటకు వచ్చే అవకాశం కనిపించడం లేదు. వంశీపై ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న కేసులన్నీ ఇప్పుడు పైకి వస్తున్నాయి. బాపులపాడు మండలంలో నకిలీ పట్టాలతో ప్రజలను మోసం చేశారంటూ నమోదైన కేసులో ఆయన రిమాండ్ ఖైదీ అయ్యారు. ఈ కేసులో ఆయన నూజివీడు కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పుడు అక్రమ మైనింగ్‌కు సంబంధించిన కేసులో పీటీ వారెంట్‌ను గన్నవరం పోలీసులు సిద్ధం చేస్తున్నారు. ఈ పీటీ వారెంట్‌ను గన్నవరం కోర్టులో దాఖలు చేస్తారా, విజయవాడ ఏసీబీ కోర్టులో దాఖలు చేస్తారా అన్న విషయంలో సందిగ్ధత ఉంది. అక్రమ మైనింగ్‌పై ఇప్పటికే విజిలెన్స్ అధికారులు నివేదికను రూపొందించారు. ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లిన కేసు కాబట్టి ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ వారంలోనే పీటీ వారెంట్ దాఖలయ్యే సూచనలు ఉన్నాయి.



మచిలీపట్నంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. బందరు బస్టాండ్ సెంటర్లో రోడ్లపై భారీగా నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. -మచిలీపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి)

విద్యుదాఘాతంతో దొండపాడు సర్పంచ్ సురేఖ మృతి

గుడివాడ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో గుడివాడ రూరల్ మండలం దొండపాడు గ్రామ సర్పంచ్ చోరగుడి సురేఖ(38) ఆదివారం సాయంత్రం మృతి చెందారు. ఇంటి వద్ద కుళాయి నుంచి వచ్చే తాగునీటిని పట్టుకునేందుకు వెళ్తుండగా కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురయ్యారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే గుడివాడ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్టు ధ్రువీకరించారు. సురేఖకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. టీడీపీ తరఫున ఆమె సర్పంచ్‌గా గెలుపొందారు. సోమవారం దొండపాడు గ్రామంలో సురేఖ భౌతికకాయానికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, టీడీపీ నాయకులు నివాళులర్పించనున్నారు.


సురేఖ (ఫైల్)

వైసీపీ కార్యాలయం కొలతలు వేయండి

›› టౌన్‌ప్లానింగ్ అధికారులకు మున్సిపల్ కమిషనర్ ఆదేశం 4



6,7,8, తేదీల్లో బీచ్ ఫెస్టివల్

›› మంత్రి కొల్లు రవీంద్ర 4



పట్టాభి స్మారక భవనానికి ప్రాధాన్యత ఏదీ!

4



అభయాంజనేయస్వామిని దర్శించుకున్న నారా రోహిత్, మంచు మనోజ్

అభయాంజనేయస్వామి సేవలో సినీ నటులు మంచు మనోజ్, నారా రోహిత్

హనుమాన్‌జంక్షన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : జంక్షన్‌లో అభయాంజనేయ స్వామిని సినీనటులు నారా రోహిత్, మంచు మనోజ్ ఆదివారం దర్శనం చేసుకున్నారు. ఈనెల 30న 'భైరవం' చిత్రం విడుదల నేపథ్యంలో విజయవాడ నుంచి ఏలూరు వెళుతూ మార్గమధ్యలో ఆలయాన్ని సందర్శించారు. ఈవో తారకేశ్వరరావు ఆలయ మర్యాదలతో వారికి సాదర స్వాగతం పలుకగా అర్చకులు తీర్థ ప్రసాదాలతో ఆశీస్సులు అందించారు. ఈవో వారికి స్వామివారి శేష వస్త్రం, చిత్రపటాన్ని బహూకరించారు. నిర్మాత కేకే రాధామోహన్, కనకమేడల విజయ్ తదితరులు వారివెంట ఉన్నారు. టీడీపీ తెలుగు మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికళ్యాణి, స్థానిక టీడీపీ నాయకులు వేమూరి శ్రీనివాసరావు, వడ్డి వాసవీ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.



పోరంకిలో మినీ మహానాడులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కొనకళ్ల తదితరులు

వైభవంగా మినీ మహానాడు

- పెనమలూరు ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం
- బోడె ప్రసాద్, కొనకళ్ల నారాయణ

పెనమలూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని పోరంకి ఎల్ఎన్ గార్డెన్స్‌లో ఆదివారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన మినీ మహానాడుకు వేలాదిగా పార్టీశ్రేణులు తరలివచ్చారు. తెలుగుమహిళలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తొలుత పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల మృతిచెందిన పలువురు టీడీపీ కార్యకర్తలకు నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి అత్యధిక ఓట్లు వేసిన స్థానాల్లో పెనమలూరు నాల్గవ స్థానంలో ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదినెలల్లో నియోజకవర్గ వ్యాప్తంగా జరిగిన అభివృద్ధిని వివరించారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధిని సమన్వయ పరచుకొని ముందుకు వెళుతున్నామన్నారు. కూటమి నేతలతో కలిసి ప్రయాణిస్తున్నామన్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం చేస్తామని తెలిపారు. పార్టీశ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, తెలుగుతమ్ముళ్లకు మహానాడు ఒక పండుగలాంటిదని పేర్కొన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ ఎప్పుడూ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పనిచేసిన వ్యక్తి అని పేర్కొన్నారు.



సభ్యత్వం కిట్లను అందజేస్తున్న ఉదయభాను

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

- పార్టీశ్రేణులకు సామినేని పిలుపు

గాంధీనగర్, మే 18 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలని పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను పార్టీ నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్స్ పంపిణీ కార్యక్రమం 36వ డివిజన్ అధ్యక్షుడు యాంపాటి ప్రభాజీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కందుకూరి కళ్యాణ మండపంలో ఆదివారం జరిగింది. క్రియాశీల సభ్యత్వ కార్డులు, పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సందేశ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ, జనసైనికులు, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. 15వ డివిజన్‌లో రెండువేల సభ్యత్వాలు నమోదు చేసిన గాదిరెడ్డి అమ్ములును అభినందించారు. రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, బొలిశెట్టి వంశీకృష్ణ, బాడిత శంకర్, సోమనాథం తదితరులు పాల్గొన్నారు.



బండి రామకృష్ణను కలిసిన మంత్రి రవీంద్ర

బండి రామకృష్ణకు మంత్రి రవీంద్ర శుభాకాంక్షలు

మచిలీపట్నం టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమానికి బండి రామకృష్ణ కృషి చేస్తారని, ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం కృష్ణాజిల్లా సహకార మార్కెటింగ్ చైర్మన్ బండి రామకృష్ణను కొల్లు రవీంద్ర కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, బండి రామకృష్ణ తన పదవికి వన్నె తెస్తారన్నారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ, తాను రైతు కుటుంబంలో పుట్టానని, రైతుల సాధక బాధకాలు తెలుసన్నారు. పల్లపాటి సుబ్రహ్మణ్యం, మరకాని పరబ్రహ్మం, గడ్డంరాజు, కె.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మ్యూజియాలు నాగరికతకు దర్పణాలు

- కొండపల్లి ఖిల్లాకు కాలినడకన కలెక్టర్ లక్ష్మీశ
- చారిత్రక ఔన్నత్యాన్ని చాటి చెప్పేందుకే

ఇబ్రహీంపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి) : మ్యూజియాలు కేవలం జ్ఞాపకాల గదులు మాత్రమే కాదని.. అవి మన నాగరికతకు దర్పణాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా ఆయన ఆదివారం కొండపల్లి ఖిల్లాకు కాలినడకన చేరుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విభిన్న సంస్కృతులను ముందుతరాలకు పరిచయం చేసే విజ్ఞాన భాండాగారాలు మ్యూజియాలని, సంస్కృతి, చారిత్రక పరిరక్షణలో వాటి పాత్ర విశిష్టమైనదన్నారు. 'మారుతున్న సమాజాల్లో మ్యూజియాల భవిష్యత్తు' అనే ఇతివృత్తంతో ఈ ఏడాది అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ఆధునిక సమాజ అవసరాలకనుగుణంగా చారిత్రక వారసత్వాన్ని కాపాడేందుకు మ్యూజియాల అభివృద్ధి చెందుతున్న తీరుకు ఇది అద్దం పడుతుందన్నారు. విజయవాడలోని బాపు మ్యూజియం, కొండపల్లి కోటలోని మ్యూజియం వంటి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేగంగా మారుతున్న ప్రపంచంలో మనం ఎక్కడి నుంచి వచ్చామో అర్థం చేసుకోవడానికి ఇవి సహాయతాయని, మార్గదర్శక జ్ఞానాన్ని అందిస్తాయని చెప్పారు. కొండపల్లి ఖిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. మ్యూజియాల విశిష్టతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్పా, డీఎవో సతీష్, కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన, ఏపీ అడ్వెంచర్ అసోసియేషన్ విజయవాడ ప్రెసిడెంట్ తరుణ్ కాకాని, ఏపీ టూరిజం అథారిటీ కన్సలెంట్ సాహితి, టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



కొండపల్లి ఖిల్లాలో కలెక్టర్ లక్ష్మీశ ట్రెక్కింగ్



కొండపల్లి ఖిల్లా మ్యూజియం ఎదుట కలెక్టర్, అధికారులు

ఖిల్లాకు రోప్ వే.. దిశగా అడుగులు!

- 2014-19 మధ్య కాలంలో టీడీపీ హయాంలో ప్రతిపాదనలు
- కొండపల్లి బొమ్మల అందాలు తిలకిస్తూ ఖిల్లాకు వెళ్లే అవకాశం



ఖిల్లా ముందు భాగంలో మూసుకుపోయిన నడక దారి

(ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి) చారిత్రక ప్రసిద్ధి గాంచిన పర్యాటక ప్రాంతం కొండపల్లి ఖిల్లా.. మూడు దశాబ్దాలుగా మూత పడిన నడక దారికి మంచి రోజులు రానున్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రోప్ వే నిర్మాణానికి మార్గం సుగమం కానుంది. ఖిల్లాకు వెనుక వైపు ఎన్టీటీపీఎస్ బూడిద చెరువు పక్క నుంచి ఘాట్ రోడ్డు ప్రస్తుతం అందరికీ తెలిసిన దారి. అయితే 1980-90 మధ్యకాలం వరకు కొండపల్లి ఖిల్లా సందర్శించాలంటే అందరూ ముందు వైపు ఉన్న నడకదారినే వెళ్లేవారు. 1988లో ఖిల్లాకు ఎగువన టీవీ టవర్ ఏర్పాటు చేసేందుకు ఖిల్లాకు వెనుక వైపు ఉన్న ఘాట్ రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి ఖిల్లాకు ముందు నడక దారిని మరుగున పడిపోయింది. బస్టాండ్ సమీపంలో గత వైభవ ఆనవాళ్లు ఇప్పటికీ దర్శనమిస్తాయి. ప్రస్తుతం అవి పిచ్చి చెట్ల మధ్య ఉన్నాయి. పురావస్తు, ప్రదర్శనశాలల కార్యాలయం మూతపడింది. కొండపల్లి ఖిల్లా అంటే గుర్తుకు వచ్చేది ముందు కొండపల్లి పట్టణం. అయితే ఖిల్లాకు వెళ్లే వారు కొండపల్లి చూడకుండానే ఘాట్‌రోడ్డు మీదుగా కొండపల్లి ఖిల్లా సందర్శించి వెళుతున్నారు. కొండపల్లి బొమ్మలు కొనుగోలు చేసుకోవాలంటే తప్ప ఇటు వైపు రావడం లేదు. ఈక్రమంలో 2014-19 మధ్యకాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఖిల్లాపై అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, లేజర్ షోలు నిర్వహించంతో పాటు ఖిల్లాపైకి రోప్ వే సన్నాహాలు చేసింది. అయితే 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఆ ప్రతిపాదనను పక్కన పెట్టేసింది.



ఖిల్లా రోడ్డులో మూతపడిన పురావస్తు, ప్రదర్శన శాలలశాఖ కార్యాలయం

కలెక్టర్ ట్రెక్కింగ్‌తో వెలుగులోకి పాత మార్గం

కలెక్టర్ జి.లక్ష్మీశ కొండపల్లి ఖిల్లాపైకి నడకదారిలో ట్రెక్కింగ్ చేస్తూ మూతపడిన మార్గంలో కొండపల్లి కోటకు చేరుకున్నారు. దీంతో ఈ దారికి పూర్వ వైభవం వస్తుందనే అభిప్రాయం కలుగుతోంది. ఇక్కడ రోప్ వేను ఏర్పాటు చేస్తే ఖిల్లాకు వచ్చే పర్యాటకులు దారి పొడవునా కొండపల్లి బొమ్మలను తిలకించడంతో పాటు వాటిని కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది.

సమయం, డబ్బు ఆదా..

ఖిల్లాకు ముందు దారి ఏర్పాటు చేస్తే అటు సమయంతో పాటు ఇటు రవాణా ఖర్చులు సైతం కలిసి వచ్చే అంశాలుగా పర్యాటకులు భావిస్తుంటారు. అంతేకాక కొండపల్లి రైల్వేస్టేషన్ నుంచి ఖిల్లా మార్గానికి సులువుగా చేరుకునే వీలుంటుంది. పైగా బస్సులు ఖిల్లా రోడ్డు వరకు వస్తాయి. రోప్ వే ఏర్పాటుతో సమయం, ఖర్చు ఆదా అవుతుంది. పెద్ద ఎత్తున పర్యాటకం అభివృద్ధి చెందే వీలుంటుంది.

పట్టాభి స్మారక భవనానికి ప్రాధాన్యత ఏదీ!

- జిల్లా కలెక్టర్, కమిషనర్, మేయర్, రీజనల్ డైరెక్టర్‌లకు నోటీసులు

మచిలీపట్నం టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి మునిసిపల్ కౌన్సిల్ ఎన్‌వోసీ ఇవ్వకపోవడంతో కమిషనర్, మేయర్, కలెక్టర్, రీజనల్ డైరెక్టర్‌లకు పట్టాభి స్మారక భవననిర్మాణ కమిటీ తరపున న్యాయవాదులు సోడిశెట్టి బాలాజీ, కె.సాయి సుదర్శన్‌లు నోటీసులు జారీ చేశారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనానికి నాటి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి స్థలం కేటాయించాలని ఆదేశాలు జారీచేసినా మునిసిపల్ కౌన్సిల్ ఎన్‌వోసీ ఇచ్చేందుకు ముందుకు రాకపోవడం తెలిసిందే. 2022 ఏప్రిల్ 22న సీసీఎల్ఏ కూడా రెండెకరాల స్థలం కేటాయించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు భవన నిర్మాణానికి కౌన్సిల్ ఎన్‌వోసీ ఇవ్వాల్సి ఉన్నా.. మూడేళ్లుగా జాప్యం చేస్తోంది. దీనిపై పలు ఉద్యమాలు నడిచాయి. కమిటీ ప్రతినిధులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు మునిసిపల్ కౌన్సిల్‌లో చర్చించాలని ఉత్తర్వులు జారీ చేసినా.. ఇప్పటికీ కౌన్సిల్ సమావేశంలో భవన నిర్మాణ అంశాన్ని ప్రవేశ పెట్టలేదు. దీనిపై పలు పర్యాయాలు కలెక్టర్, కమిషనర్‌కు పట్టాభి భవన నిర్మాణ కమిటీ ప్రతినిధులు వినతిపత్రాలు ఇచ్చారు. అయినప్పటికీ స్పందించకపోవడంతో హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, మేయర్, కలెక్టర్, రీజనల్ డైరెక్టర్‌కు న్యాయవాదులు లీగల్ నోటీసులు ఇచ్చారు. ఈ నోటీసులపై ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

వైసీపీ కార్యాలయం కొలతలు వేయండి!

- టౌన్‌ప్లానింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశాలు

మచిలీపట్నం టౌన్: ఈడేపల్లిలో నిర్మించిన వైసీపీ కార్యాలయ విస్తీర్ణం కొలతలు వేయాలంటూ టౌన్ ప్లానింగ్ అధికారి, టౌన్ సర్వేయర్, మునిసిపల్ రెవెన్యూ అధికారి తదితరులకు శనివారం సాయంత్రం మునిసిపల్ కమిషనరు బాపిరాజు ఆదేశాలు జారీ చేశారు. కార్యాలయం ఎంత స్థలంలో నిర్మించిందీ స్కెచ్ వేయాలంటూ కిందిస్థాయి అధికారులకు కమిషనరు ఆదేశాలు జారీ చేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పేర్ని నాని సమక్షంలో టౌన్ ప్లానింగ్ అధికారులు కొలతలు వేయాలని కమిషనర్ ఆదేశించారు. భవనం, ఖాళీస్థలం పన్నుల వివరాలు తెలియచేయాలన్నారు. కాగా గతంలో ఈ భవనం అక్రమంగా నిర్మించారంటూ ఆందోళనకు దిగిన అప్పటి ప్రతిపక్ష నేత కొల్లు రవీంద్ర భవనం చూసేందుకు వెళ్లగా పోలీసులు అడ్డుకుని స్టేషన్ల చుట్టూ తిప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నందున ఈ భవనంపై ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందోనని స్థానికంగా చర్చనీయాంశమైంది.



వైసీపీ కార్యాలయం

21న డీఈవో కార్యాలయం ముట్టడి

- ఉపాధ్యాయ సంఘాల పిలుపు

మచిలీపట్నం టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల పునర్‌వ్యవస్థీకరణ, ఉపాధ్యాయుల బదిలీల నిబంధనలు సవరించాలంటూ ఈనెల 21న డీఈవో కార్యాలయ ముట్టడికి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. యూటీఎఫ్ కార్యాలయంలో కృష్ణాజిల్లా ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ సభ్యుడు బి.లంకేష్, షౌకత్ హుస్సేన్‌ల ఆధ్వర్యంలో కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సుందరయ్య, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి పి.ఇమానుయేల్, ఏపీటీఎఫ్ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, పీఆర్టీయూ నాయకుడు పి.శ్రీనివాస్, ఏపీటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు వి.రాధిక, ఆప్టా నాయకుడు సదారతుల్లా, ఏఆర్ అస్లాం, మైనారిటీ టీచర్ అసోసియేషన్ నాయకుడు అబ్బాస్, ఏపీయూఎస్ నాయకుడు బి.రఘునాథ్, డీపీ ఆర్టీయూ నాయకుడు సున్న రాంబాబు, ఏపీసీపీఎస్ఈ నేత నాంచారయ్య, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు జె.లెనిన్‌బాబు, మహంకాళేశ్వరరావు, చంద్రశేఖరరెడ్డి తదితరులు మాట్లాడారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద బదిలీ కోరుకునే ఉపాధ్యాయులకు ఇచ్చిన నిబంధనలు సవరించాలన్నారు. 117 జీవో రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఏ ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మోడల్ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పోస్టులను ఎస్జీటీల నుంచి పదోన్నతులు కల్పించి ఇవ్వాలన్నారు.

'ఉపాధి'లో అవినీతిపై చర్యల్లేవ్!

(3వ పేజీ తరువాయి)

ప్రభుత్వ హయాంలో ఈ టెక్నికల్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడటంతో కొంతకాలం సస్పెండ్ చేశారు. అనంతరం గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా మళ్లీ ఉద్యోగం ఇచ్చారు. వైసీపీకి సానుభూతిపరుడిగా ఉన్న వాడపాలెం సర్పంచ్ కుమారుడు టెక్నికల్ అసిస్టెంట్ కావడంతో అతనికి మళ్లీ ఉద్యోగం ఇచ్చారనే ఆరోపణలు అప్పట్లో వినిపించాయి. గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ అక్కడ కూడా అక్రమాలకు పాల్పడటంపై ఫిర్యాదులు అందాయి. దీంతో విచారణ చేసిన అధికారులు అతన్ని సస్పెండ్ చేశారు. అయినా అక్రమంగా తీసుకున్న సొమ్మును రికవరీ చేయకుండా, శాఖాపరంగా తదుపరి చర్యలు తీసుకోకుండా డ్వామా అధికారులు మీన మేషాలు లెక్కిస్తున్నారు.

వంశీని వెంటాడుతున్న పీటీ వారెంట్లు

(3వ పేజీ తరువాయి)

విచారణ ఎదుర్కొంటున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా వంశీ అడ్డగోలుగా వ్యవహరించారు. చంద్రబాబు కుటుంబంపై వ్యక్తిగతంగా దూషణలు చేయడంతో పాటు గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై దాడి చేయించడం, ఆ కేసు నుంచి తప్పుకునేందుకు ఫిర్యాదుదారుడిగా ఉన్న సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసిన ఘటనలపై కేసులు నమోదయ్యాయి. గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వంశీ 71వ నిందితుడిగా ఉన్నారు. ఈ కేసు నుంచి బయటపడేందుకు వంశీ అత్యుత్సాహం చూపారు. ఫిర్యాదుదారుడు సత్యవర్ధన్‌ను బెదిరించి కేసును ఉపసంహరించుకునేలా చేశారు. ఈ కేసులో వంశీ ఇరుక్కుపోయారు. ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లతో కేసు నమోదు చేశారు. ఈ కేసులో అరెస్టయిన వంశీకి బయటకు వచ్చే దారులు మూసుకుపోతున్నాయి.

ట్రాన్స్‌కోనా మజాకా!

(3వ పేజీ తరువాయి)

పనులు ప్రారంభించటానికి రెండు నెలల ముందు ఇవ్వాలి. కానీ ట్రాన్స్‌కో అధికారులు మాత్రం పనులు ప్రారంభించి, పురోగతిలో ఉన్న తర్వాత ప్రజాభిప్రాయ సేకరణ నోటిఫికేషన్ ఇచ్చారు. దీనిపై ఎవరైనా అభ్యంతరం వ్యక్తం చేస్తే ఏమి చేస్తారు? ప్రజాభిప్రాయ సేకరణ విధానాన్ని అపహాస్యం పాలుచేశారని కోర్టును ఆశ్రయిస్తే ఏమవుతుందన్న ఆలోచన కూడా చేయకపోవటం గమనార్హం. ఒకవేళ కోర్టు అక్షింతలు వేసి పనులు నిలుపుదల చేయమంటే ఇప్పటి వరకు ఖర్చుపెట్టిన కోట్ల రూపాయలు వృథా అయినట్టేనని విమర్శలు వినిపిస్తున్నాయి.

ముచ్చటగా మూడోది..

గన్నవరంలో కడుతున్న మూడో 32 కేవీ సబ్‌స్టేషన్ ఇది. ప్రస్తుతం గన్నవరంలో ఉన్న పాత సబ్‌స్టేషన్ పక్కనే కోట్లాది రూపాయల వ్యయంతో సబ్‌స్టేషన్‌ను కట్టి, దానిని వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేశారు. దీంతో పాత సబ్‌స్టేషనే దిక్కుగా మారింది. కొత్తగా కట్టిన సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురాకుండానే.. మేధా ఐటీ టవర్ సమీపంలో 132/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అక్కడ కూడా సబ్‌స్టేషన్ కట్టడానికి టెండర్లు పిలిచారు. పనులు ప్రారంభించగానే.. ఆగిపోయాయి. దీంతో ఈ రెండింటినీ కాదని గన్నవరం ఎయిర్‌పోర్టులో మూడోదిగా సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నారు. రెండు చోట్ల విఫలమైన విద్యుత్ శాఖ అధికారులు కనీసం మూడో చోట అయినా జాగ్రత్తగా వ్యవహరించాల్సింది పోయి.. ఇక్కడ కూడా పనులు మొదలు పెట్టేసి పురోగతిలో ఉన్న తర్వాత ప్రజాభిప్రాయ సేకరణ నోటిఫికేషన్ ఇచ్చారు. పనులు మొదలు పెట్టేసిన తర్వాత అభ్యంతరాలు తీసుకోవటమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.



ఆంధ్రప్రదేశ్ రాజపత్రము
THE ANDHRA PRADESH GAZETTE
PUBLISHED BY AUTHORITY
PART II - MISCELLANEOUS NOTIFICATIONS OF INTEREST TO THE PUBLIC
NOTIFICATIONS BY HEADS OF DEPARTMENTS Etc.,
TRANSMISSION CORPORATION OF ANDHRA PRADESH LIMITED
CHIEF ENGINEER,
PROJECTS,
APTRANSCO,
Vidyut Soudha, Vijayawada

నోటిఫికేషన్ విడుదల కాపీ



హజ్ యాత్ర బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న మత పెద్దలు

మక్కాలో రాష్ట్రం, దేశం కోసం ప్రార్థించండి

- హజ్ కమిటీ చైర్మన్ హాజీ హాసన్ బాషా

వన్‌టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : మక్కా యాత్రకు వెళ్లేవారు రాష్ట్రం, దేశం అభివృద్ధి కోసం ప్రార్థించాలని ఏపీ హజ్ కమిటీ చైర్మన్ హాజీ హాసన్ బాషా అన్నారు. విజయవాడ షాజహూర్ ముసాఫిర్ ఖానా వద్ద నుంచి ఆదివారం రాష్ట్ర హజ్ కమిటీ ఆధ్వర్యంలో 98 మంది హజ్ యాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా చైర్మన్, టీడీపీ రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఎండీ ఫతావుల్లా, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్‌తో కలిసి ఆయన బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, హజ్ యాత్రకు కావాల్సిన అన్ని వసతులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. మక్కా, మదీనా నగరాల్లో అన్ని వసతులతో ఉండేలా ఏర్పాట్లు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు అబ్దుల్ సలాం, మౌలానా సత్తార్ ఖాన్, హఫీజ్ అన్వర్ ఆలీ, టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా తదితరులు పాల్గొన్నారు.



అంతర్‌జిల్లా ఈత పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఈత పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కంకిపాడు, మే 18 (ఆంధ్రజ్యోతి) : జూన్ 1న నరసరావుపేటలో నిర్వహించనున్న సీనియర్ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక ఆదివారం ఈడుపుగల్లులో జరిగింది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు చెందిన క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎన్టీఆర్ జిల్లా పురుషుల విభాగంలో ఎ.దేవ గణేష్, ఎం.శరత్, పీవీ సత్యనారాయణ, పి.కిరణ్, వై.రోహిత్ మల్లిఖార్జున, కె.శక్తిధర్, టి.పార్థు, బి.బాల గంగాధర్, వి.గిరిష్, డి.సత్యమూర్తి, మహిళల విభాగంలో యు.ప్రమముర్త, పి.రమ్యసాయి, కె.సాన్వి, సీహెచ్ మౌనిక, ఎల్.మేఘన, ఎం.దేవిదుర్గ ఎంపికయ్యారు. కృష్ణాజిల్లా నుంచి పురుషుల విభాగంలో మూర్తి మనహర్ గురునాధ్, ఎం.ఎ. జయ బాబు, పి.నీరజ్ మనికంఠ, పీబీ అనంత్ రెడ్డి, టి.పృథ్వి ప్రసాద్, ఎస్.హర్ష వర్ధన్, గిర్ల, మహిళల విభాగంలో టి.సహశ్ర, ఎస్.సిరి చందన, డి.వి.ఎస్ఆర్ లక్ష్మిలు ఎంపికయ్యారు.



బీచ్ ఫెస్టివల్‌పై అధికారులతో చర్చిస్తున్న మంత్రి రవీంద్ర, బండి రామకృష్ణ

జూన్ 6, 7, 8, తేదీల్లో బీచ్ ఫెస్టివల్

- ఏర్పాట్లపై మంత్రి రవీంద్ర సమీక్ష

మచిలీపట్నం టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : మంగినపూడి బీచ్‌లో జూన్ 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్‌కు వచ్చే లక్షలాది పర్యాటకులు, యాత్రీకులకు అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర అధికారులకు సూచించారు. ఆదివారం రాత్రి మంగినపూడి బీచ్‌ను అధికారులతో మంత్రి సందర్శించారు. అమరావతి గేట్‌పై సీనీడిజైనర్ వంకా రమణతో చర్చించారు. ఫుడ్ కోర్టుల ఏర్పాటుపై మెప్మా పీడీ సాయిబాబుతో చర్చలు జరిపారు. మసులా ఫెస్టివల్-2025 జాతీయ స్థాయి ఈవెంట్‌గా రూపొందించాలని, ఇందుకు కావలసిన అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులకు, కళాకారులకు సూచించారు. బీచ్ ఫెస్టివల్‌లో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు, జలక్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, ఆర్‌అండ్‌బీ, ఎలక్ట్రికల్, రెవెన్యూ, మత్స్యశాఖ, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

కౌలు రైతులకు సబ్సిడీపై విత్తనాలివ్వాలి: కౌలు రైతు సంఘం

విజయవాడ రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ జూన్ మొదటి వారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో కౌలు రైతులకు సబ్సిడీతో కూడిన సర్టిఫైడ్ పంట విత్తనాలు అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.కాటమయ్య, ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. వెంటనే సాగు ప్రణాళిక ప్రకటించి, సాగుకు అవసరమైన చర్యలు చేపట్టాలని వారు కోరారు. మార్కెట్‌లో విత్తనాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, నకిలీ విత్తనాలు కొని పలుచోట్ల రైతులు మోసపోతున్నారని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్న ప్రైవేటు సంస్థలపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. నాశిరకం విత్తనాలు విక్రయిస్తున్న ఏజెన్సీల నిర్వాహకులపై అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగించాలని, ప్రభుత్వ ధ్రువీకరణ విత్తనాలు మాత్రమే మార్కెట్‌లో అమ్మేలా చూడాలని వారు కోరారు.



అభయాంజనేయస్వామి ఆలయం ఎదుట కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

వైభవంగా హనుమజ్జయంతి ఉత్సవాలు

హనుమాన్‌జంక్షన్, మే 18(ఆంధ్రజ్యోతి): అభయాంజనేయస్వామి దేవస్థానంలో 24వ హనుమజ్జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజు ఆదివారం తెల్లవారుజామున ఆలయ ప్రధాన అర్చకుడు మారేపల్లి సీతారామానుజాచార్యుడు స్వామికి సుప్రభాత సేవ, అర్చన, గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం 1008 లిల్లీపూలతో పూజ చేశారు. ముముక్షు భజన సమాజం మహిళలు కళావేదికపై సంప్రదాయ సంకీర్తనలు ఆలపించారు. ఆలయం ఎదుట విజయదుర్గ కోలాటం బృందం మహిళలు ప్రదర్శించిన కోలాటం భజన స్థానికులను రంజింపచేసింది. ఈవో పి.తారకేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఇరువర్గాల ఘర్షణ.. ఇద్దరికి స్వల్పగాయాలు

పెనమలూరు, మే 18(ఆంధ్రజ్యోతి): కానూరులో పైపులైను వేసే పని చేస్తుండగా ఇరువర్గాలు పరస్పరం దాడులకు దిగాయి. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడ్డ ఇద్దరూ ప్రభుత్వాస్పత్రిలో చేరి ఫిర్యాదులు చేసుకోవడంతో పెనమలూరు పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పాత కానూరుకు చెందిన మరీదు కృష్ణమోహన్, జన్ను మురళీకృష్ణ పక్కపక్క ఇళ్లలో ఉంటారు. మురళీకృష్ణ పాత వాటర్‌పైపులైన్ తీసివేసి కొత్తది వేసుకుంటున్నాడు. పైపులైన్ తిన్నగా వేయడంలేదనే చర్చ రావడంతో ఇద్దరూ గొడవపడ్డారు. ఇద్దరి తరఫున వచ్చిన వ్యక్తులు పలుగు, కత్తులతో పరస్పరం దాడులకు దిగారు. దాడుల్లో మరీదు కృష్ణమోహన్, జన్ను మురళీకృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ఇద్దరూ ప్రభుత్వాసుపత్రిలో చేరి ఫిర్యాదు చేసుకున్నారు. శనివారం జరిగిన ఈఘటనపై పెనమలూరు పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఇందులో ఒక వర్గం వారు రెండో వర్గంపై పోలీసులు కేసు నమోదు చేయడంలో తాత్సారం చేస్తున్నారని నిరసన తెలిపారు.

సిమెంట్ వ్యాపారికి సైబర్ నేరగాళ్ల టోకరా

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): వీరవల్లికి చెందిన సిమెంట్ వ్యాపారిని సైబర్‌నేరగాళ్లు పోలీసుల పేరుతో బురిడీ కొట్టించి రూ.70 వేలు ఫోన్‌పే చేయించుకున్నారు. ఈ ఘటన ఆదివారం వెలుగుచూసింది. వీరవల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన ఆర్నేపల్లి రంగారావు స్థానికంగా సిమెంటు, ఇనుము వ్యాపారం చేస్తుంటాడు. శుక్రవారం సాయంత్రం ఆయనకు కొత్త నెంబరు నుంచి ఫోన్ వచ్చింది. ఏఎస్సై ఆనందరావును మాట్లాడుతున్నానని, ఎస్సైకు అత్యవసరంగా రూ.70వేలు కావాలని శనివారం తిరిగి ఇచ్చేస్తామని చెప్పడంతో రంగారావు నమ్మాడు. తన దగ్గర నగదు లేకపోవడంతో అల్లుడు డోకల శ్రీహరి ద్వారా నగదు ఫోన్‌పే చేయించారు. ఆదివారం కూడా నగదు పంపకపోవడం, నగదు పంపిన ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసి ఉండటంతో అనుమానం వచ్చి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విచారించారు. ఆనందరావు అనే పేరుతో పోలీస్‌స్టేషన్‌లో ఎవరూ లేరని తేలడంతో మోసపోయామని గ్రహించిన బాధితుడు రంగారావు ఎస్సై శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశాడు. ఫోన్‌పే ద్వారా నగదు వెళ్లిన బ్యాంకు ఖాతా హైదరాబాద్ సనత్‌నగర్ ఉన్నట్లు గుర్తించామని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కోడి పందేలు వేస్తున్న ఇద్దరి అరెస్టు

పెనమలూరు, మే 18(ఆంధ్రజ్యోతి): యనమలకుదురు హోసన్నామందిర్ వెనుక ఖాళీ స్థలంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై ఫిరోజ్ తన సిబ్బందితో వెళ్లి ఆదివారం దాడి చేశారు. పందేలు వేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,300 నగదు, రెండు కోడి పుంజులు, ఆరు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మినీ మహానాడుకు పోటెత్తిన టీడీపీ శ్రేణులు

పెనమలూరు, మే 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆధ్వర్యంలో పోరంకి ఎల్ఎన్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన మినీ మహానాడుకు వేలాదిగా టీడీపీ కార్యకర్తలు తరలివచ్చారు. టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, పార్టీ పరిశీలకుడు జువ్వాది రామకృష్ణ, తెలుగుమహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు మాట్లాడుతూ టీడీపీకి ఉన్న కేడర్ ఏ పార్టీకీ లేదన్నారు. కార్యకర్తలే పార్టీకి బలమన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు షేక్ బుజ్జి, కొండా ప్రవీణ్, పీతా గోపీచంద్‌లు మాట్లాడుతూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మారుపూడి ధనకోటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, కోయ ఆనంద్‌ప్రసాద్, సంగెపు రంగారావు, తుమ్మలపల్లి హరికృష్ణ, శొంఠి శివరాంప్రసాద్, దాసరి హరినీడు, మేడసాని రత్నకుమారి, సూదిమళ్ల రవీంద్ర, వెనిగళ్ల కుటుంబరావు, జంపాన గుర్నాథం, దోనేపూడి రవికిరణ్, వల్లభనేని నాని, నెరుసు రాజ్యలక్ష్మి, కూనపరెడ్డి వాసు, వడ్లమూడి శుభశేఖర్, గొల్లి వసంత్ తదితరులు ఉన్నారు.



మినీ మహానాడుకు హాజరైన టీడీపీ శ్రేణులు

టీడీపీ 'తాడిగడప' అధ్యక్షుడిగా అనుమోలు ప్రభాకరరావు



టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడిగా అనుమోలు ప్రభాకరరావు తిరిగి ఎంపికయ్యారు. పార్టీ విధేయుడిగా పేరున్న అనుమోలును అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా మినీ మహానాడు వేదికగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఎంపిక చేశారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని అనుమోలు తెలిపారు.



కంకిపాడు-గొడవర్రు-రొయ్యూరు ప్రధాన రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, జనసేన నాయకులు

కూటమి ప్రభుత్వంలో రహదారులకు మహర్దశ

కంకిపాడు, మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రహదారులకు మహర్దశ వచ్చిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహకారంతో రూ.3.75 కోట్లతో నిర్మించిన కంకిపాడు-గొడవర్రు-రొయ్యూరు ప్రధాన రహదారిని ఆదివారం ఆయన ప్రారంభించారు. 2019-24 మధ్య రాష్ట్ర రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్లు దాచుకోవడం, దోచుకోవడం మినహా అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అంతర్గత రహదారులతో పాటు ప్రధాన రహదారులను అభివృద్ధి చేసి చూపించామన్నారు. ఇటువంటి ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా ఉండాలని కోరారు. పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కోనేరు భాను, యార్లగడ్డ బోసు, రవీంద్ర, అనుమోలు ప్రభాకర్ భాస్కరరావు, కోనేరు రాజేష్, పులి శ్రీనివాసరావు, జనసేన నాయకులు పులి కామేశ్వరరావు, ముప్పా రాజా, ఏసుపాదం, మేదంద్రావు సతీష్, బీజేపీ నాయకులు గుల్లపల్లి శ్రీనివాసరావు, దివి రోహిణి పాల్గొన్నారు.

22న పురుషోత్తపట్నం అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు

గన్నవరం, మే 18(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపట్నం గ్రామంలోని అభయాంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 22న హనుమజ్జయంతి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకుడు సుంకర శివరామకృష్ణ(శివయ్య) తెలిపారు. ఉదయం 7గంటల నుంచి విశేష పూజలు, పండ్ల రసములు, పంచామృతాలు, పంచసూక్తాలతో మూల విరాట్‌కు అభిషేకాలు, లక్ష్మీ గణపతి సహిత రుద్రహోమం, 1,116 తమలపాకులు, 1,116 అరటి పండ్లతో సహస్రనామార్చనలు జరుగుతాయని, సాయంత్రం 7గంటలకు సువర్చల సహిత అభయాంజనేయస్వామి శాంతి కల్యాణం జరుగుతుందని తెలిపారు. అనంతరం అన్నసంతర్పణ ఉంటుందని తెలిపారు.



రామవరప్పాడులో వాహనాలను తనిఖీ చేస్తున్న సెంట్రల్ ఏసీపీ కె.దామోదర్, సీఐ వి.పవన్ కిషోర్

మాదకద్రవ్యాలు కలిగి ఉంటే కఠిన చర్యలు

ప్రసాదంపాడు, మే 18(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను కలిగి ఉన్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సెంట్రల్ ఏసీపీ దామోదర్ హెచ్చరించారు. ఆదివారం రామవరప్పాడులోని పీఎస్ఆర్ ఎఆర్ కాలనీ, హనుమాన్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆయన కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పలు వాహనాలను నిలిపి వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. గుట్కాలు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. గంజాయి తాగి ఎవరైనా స్థానికులను ఇబ్బందులను పెడుతుంటే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. సీఐలు పవన్‌కిషోర్, ప్రకాష్, శ్రీనివాస్, ఎస్సైలు హరికృష్ణ, కృష్ణవర్మ, రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

23న ఏఎంసీ కార్యవర్గ ప్రమాణస్వీకారం

కంకిపాడు, మే 18(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌యార్డ్ చైర్మన్, కార్యవర్గ ప్రమాణస్వీకారం ఈనెల 23వ తేదీన సాయంత్రం 5 గంటలకు యార్డు ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని చైర్మన్‌గా ఎంపికైన టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య తెలిపారు. ఉప్పలూరులోని తన నివాసంలో ఆదివారం మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కల్యాణి, డైరెక్టర్లతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో సుందరకాండ యజ్ఞం

హనుమాన్‌జంక్షన్, మే 18(ఆంధ్రజ్యోతి): నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో లోక కల్యాణార్థం ఆదివారం సుందరకాండ పారాయణ యజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈవో వై.శ్రీనివాస్ పర్యవేక్షణలో అర్చకుడు చక్రావధానుల సీతారామాచార్యులు యజ్ఞ కార్యక్రమాన్ని శని, ఆదివారాల్లో నిర్వహించారు. ఆంజనేయస్వామికి విశేష ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కాకాని అరుణ, మహిళలు పాల్గొన్నారు.

21 నుంచి అంకమ్మ జాతర

ఉయ్యూరు, మే 18(ఆంధ్రజ్యోతి): ఉయ్యూరులో జంపానవారి అంకమ్మ జాతర బుధవారం నుంచి ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ తెలిపింది. ఐదు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించే జాతరలో మొదటి రోజు ఉదయం కోలపట్టుట, సుడిపికిరి, రెండో రోజు మాతపెళ్లి, మూడో రోజు గజాల కొలుపు, నాలుగో రోజు అమ్మవారి ఊరేగింపు, ఐదో రోజు మొక్కులు తీర్చుకొనుట, రాత్రికి రేణుక యుద్ధం నిర్వహిస్తున్నట్టు తెలిపింది.



టోర్నమెంట్ విజేతలతో నిర్వాహకులు

పోరంకిలో చెస్ జిల్లా పోటీలు

విజయవాడ(స్పోర్ట్స్), మే 18(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా అండర్-15 బాలబాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీలు పోరంకిలోని విజ్ఞాన భారతి హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించారు. బాలుర విభాగంలో 28 మంది, బాలికల విభాగంలో 15మంది పాల్గొన్నారు. ఒక్కో విభాగంలో 5రౌండ్లు జరగ్గా బాలుర విభాగంలో హర్షిత్‌సాయి, లలిత్ కౌశిక్, మోనిష్, భానుప్రకాష్, బాలికల విభాగంలో గీతా మాధురి, నాగ శోభశ్రీ, హర్షిత గౌడ్, లాస్య వెంకట ప్రియ విజయం సాధించారు. విజేతలు జూలైలో అండర్-15 రాష్ట్ర చాంపియన్‌షిప్‌లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు. విజ్ఞాన భారతి హైస్కూల్ డైరెక్టర్ కేఆర్ఎస్ రావు, కె.శ్రీనివాస్, పి.రేణుక, డిప్యూటీ తహసీల్దార్ నాగజ్యోతి, ఫణికుమార్ పాల్గొన్నారు.

దేవాలయ భూముల కౌలుకు వేలం

విజయవాడ రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): నున్న గ్రామంలోని రామలింగేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, కాశీవిశ్వేశరస్వామి దేవస్థానాల భూములను కౌలు చేసుకునే హక్కు పొందేందుకు వేలం నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ ఈవో ఎస్. హేమలతాదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు దేవస్థానాలకు నున్న, కుందావారి కండ్రికలో మొత్తం 32.43 ఎకరాల భూములు ఉన్నాయని రానున్న మూడేళ్లు ఆ భూములు కౌలుకు ఇచ్చేందుకు ఈ నెల 21న నున్న గ్రామంలోని శ్రీ కాశీవిశ్వేశ్వర దేవస్థానంలో వేలం నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మొత్తం మూడు భాగాలుగా వేలం ప్రక్రియ జరుగుతుందని, తెలిపారు. వేలంలో పాల్గొనేవారు బిట్టుకు రూ.25వేలు చొప్పున చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు గ్రామంలోని ఈవో కార్యాలయంలో సంప్రదించాలని ఆమె సూచించారు.

నేడు కొండేశ్వరస్వామి దేవస్థాన భూములకు..

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): వీరవల్లిలో కొండేశ్వరస్వామి దేవస్థానం భూములను మూడేళ్లపాటు(2025-28) కౌలు చేసుకునే హక్కు పొందేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు దేవస్థానం ఆవరణలో వేలం నిర్వహిస్తామని ఈవో ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఆర్.ఎస్.నెం.597, 607లోని 3 ఎకరాల 16సెంట్ల విస్తీర్ణం గల వ్యవసాయ భూమిని కౌలు చేసుకునేందుకు ఆసక్తి గలవారు రూ.8వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవచ్చని ఈవో స్పష్టంచేశారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హనుమాన్‌జంక్షన్, మే 18(ఆంధ్రజ్యోతి): ఏలూరు రోడ్డులోని అప్పనవీడు జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం సందడిగా నిర్వహించారు. 1992-93 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్య నేర్పిన గురువులను సత్కరించారు. విశ్రాంత హెచ్ఎంలు మారుబోయిన కోటేశ్వరరావు, నిడమర్తి లలితా కామేశ్వరి, రమణను సత్కరించారు. పూర్వ విద్యార్థులు తమిరి రమేశ్, తిరుపతిరావు, యుగంధర్ పర్యవేక్షించారు.



విశ్రాంత హెచ్ఎం లలితాకామేశ్వరిని సత్కరిస్తున్న అప్పనీడు హైస్కూల్ టెన్త్ 1992-93 బ్యాచ్ విద్యార్థినులు

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు

గన్నవరం, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్యారమ్స్, చెస్ క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు విజ్ఞాన సంపదను పెంచేందుకే వేసవి విజ్ఞాన శిబిరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గ్రంథాలయ అధికారి కె.కృపానందం తెలిపారు. ముస్తాబాదలో కథల పుస్తకాలను చదివించి ఆటలాడించారు. గ్రంథాలయ అధికారి కె.జ్యోతికుమారి పాల్గొన్నారు.

ఇంగ్లిష్ కథల పుస్తకాలపై సమీక్ష

హనుమాన్‌జంక్షన్‌రూరల్: పుస్తక పఠనం ద్వారా ఇంగ్లిష్‌పై పట్టు సాధించవచ్చని విద్యార్థులకు గ్రంథాలయాధికారి స్వర్ణలతాదేవి సూచించారు. వీరవల్లి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులతో ఇంగ్లిష్ కథల పుస్తకాలను చదివించి, వాటిపై సమీక్ష నిర్వహించారు. దినపత్రికల్లో వచ్చే పజిల్స్ పూరించడం చేయించారు. పాటల పోటీలు నిర్వహించారు.

విద్యార్థులకు కరాటే శిక్షణ

ఉయ్యూరు: గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు చెస్, క్యారమ్స్, కరాటేలో శిక్షణ ఇచ్చారు. కథల పుస్తకాలు చదివించి అందులో నీతిని తెలియజేశారు. కరాటే శిక్షకుడు జి.వేణు విద్యార్థులకు కరాటేలో మెళకువలు నేర్పించారు. విద్యార్థులకు పలు అంశాల్లో అవగాహన కల్పిస్తున్నట్టు గ్రంథాలయ అధికారి బి.రమణి తెలిపారు.



ఉయ్యూరు గ్రంథాలయంలో కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

కొండాలమ్మను దర్శించుకున్న న్యాయాధికారి

గుడ్లవల్లేరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారిని గుడివాడ జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.గాయిత్రి కుటుంబసభ్యులతో కలసి ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం న్యాయాధికారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. సుమారు ఇరవైవేలమంది భక్తులు ఇఅమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు చల్లని తాగునీరు, మజ్జిగ పంపిణీని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు పర్యవేక్షించారు.



న్యాయాధికారికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకుడు

అడుగడుగునా ఆటంకాలేనా..!

● రాజకీయ నేతల జోక్యంతో కుంటుపడుతున్న అభివృద్ధి ● కూచిపూడి బస్టాండ్ వద్ద ఆక్రమణల తొలగింపులో తీవ్ర జాప్యం

(ఆంధ్రజ్యోతి - కూచిపూడి): కూచిపూడిని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక పక్క ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కూచిపూడి ప్రధాన సెంటర్‌లో బస్టాండ్ చుట్టూ ఉన్న ఆక్రమణల తొలగింపులో అధికారుల ఉదాసీనత కారణంగా అభివృద్ధి ముందుకు సాగటం లేదు. దీనికి తోడు రాజకీయ నేతల జోక్యం కారణంగా కొనసాగుతుంది. ఆర్అండ్‌బీ, గ్రామపంచాయతీకి సంబంధించిన స్థలాలను ఆక్రమించుకుని దశాబ్దాల క్రితం కూచిపూడి బస్టాండ్ చుట్టూ ఆక్రమణదారులు 42 దుకాణాలు నిర్మించుకున్నారు. గ్రామాభివృద్ధిలో భాగంగా గ్రామ పంచాయతీ వారు గతేడాది ఆక్రమణల తొలగింపుపై హైకోర్టును ఆశ్రయించగా, దుకాణదారులకు నోటీసులు ఇచ్చి 15 రోజుల వ్యవధిలో దుకాణాలు తొలగించాలని కోర్టు ఆదేశించింది. గత సంవత్సర కాలం నుంచి అధికారులు ఇప్పటి వరకు నోటీసులతోనే సరిపుచ్చుతూ దుకాణాల తొలగింపులో తీవ్ర జాప్యం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోపక్క రాజకీయ నేతల జోక్యం కారణంగా దుకాణాల తొలగింపుకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఆక్రమణలు తొలగించి దుకాణాల సముదాయాన్ని ఏర్పాటు చేయటం వల్ల గ్రామపంచాయతీకి ఆదాయం సమకూరటంతోపాటు గ్రామాభివృద్ధి జరుగుతుందని గ్రామపంచాయతీ సర్పంచ్ కొండవీటి విజయలక్ష్మి పేర్కొంటున్నారు. దేవుడు వరమిచ్చినా, పూజారి వరమివ్వడు అన్న చందంగా కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఆక్రమణల తొలగింపులో అధికారుల ఉదాసీన వైఖరి విమర్శల పాలవుతుంది.

కోర్టు సెలవుల అనంతరం చర్యలు చేపడతాం

దుకాణదారులకు ఇప్పటికే పలు పర్యాయాలు నోటీసులు అందించి ఉన్నాం. ఆక్రమణదారులు మరో మారు కోర్టును ఆశ్రయించి ఉన్నారు. హైకోర్టు సెలవుల అనంతరం కోర్టు ఆదేశాలను అనుసరించి దుకాణాల తొలగింపుకు చర్యలు చేపడతాము.

పుష్పనాథం , ఈవో



కూచిపూడి బస్టాండ్ చుట్టూ ఆక్రమణలు

హనుమజ్జయంతి ఉత్సవాలు రేపటి నుంచి

గుడివాడ, మే 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బంటుమిల్లి రోడ్డులో వేంచేసియున్న వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 20వ తేదీ వైశాఖ బహుళ అష్టమి నుంచి 22వ తేదీ వైశాఖ బహుళ దశమి వరకు హనుమజ్జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు దేవస్థాన కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలను స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభిస్తారన్నారు. 20వ తేదీ ఉత్సవాల తొలిరోజు గోపూజ, పంచామృత అభిషేకాలు, సాయంత్రం అరుణాచలేశ్వరా నాట్య నిలయం, గుడివాడ వారి ఆధ్వర్యంలో పీతా అనూషా బృందం వారిచే కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు నిర్వహించనున్నామన్నారు. 21వ తేదీ తమలపాకుల అర్చన, సాయంత్రం బి.రమాదేవి, భక్త బృందం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. చివరి రోజు హనుమజ్జయంతి సందర్భంగా సింధూర అర్చన, రాత్రికి దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త తుమ్మలపల్లి పరేష్, ఛాయ దంపతులచే సీతారాముల శాంతి కల్యాణం నిర్వహించనున్నామని ఆయన పేర్కొన్నారు. భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని ఈవో యార్లగడ్డ వాసు కోరారు.



రామకృష్ణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

వెనిగండ్లను కలిసిన బండి

గుడివాడ, మే 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్వగృహంలో ఎమ్మెల్యే వెనిగండ్లను ఆదివారం జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డి.సి.ఎం.ఎస్) చైర్మన్ బండి రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఇరువురు చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే వెనిగండ్ల మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కన్వీనర్‌గా బండి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేశారని, సమర్థుడికి రైతులకు సేవ చేసే అవకాశం కలగడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, నాయకులు వేమూరి త్రినాథ్, గుండు వెంకట్రావు, కనకదుర్గ, గడ్డం రాజు, కొండ, కోటి, మైఖేల్, కోన ఏడుకొండలు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరం

గుడివాడ, మే 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని ప్రభావతి గార్డెన్స్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో డాక్టర్ తిపిర్నేని లక్ష్మీ పెరుమాళ్లు, ప్రభావతి, చలసాని రాయన్ చౌదరిల జ్ఞాపకార్థం డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ దేవి శశిరాయ్, డాక్టర్ అభిషేక్, డాక్టర్ తరుణ్‌కుమార్‌లు వైద్యసేవలందించారు. ఈ శిబిరంలో 45మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు టి.ఎన్ రాజశేఖర్, జి.కిరణ్‌బాబు, పూర్వ అధ్యక్షులు సి.సూర్యచంద్రరావు, బి.శంకరరావు, యమ్.రమణమూర్తి, సభ్యులు రమేష్ బాబు, శంకర్, మారుతీకుమార్, వైద్య కళాశాల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ స్వామి, నర్సింగ్ విద్యార్థులు, ఫార్మసీ అసిస్టెంట్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

సమాజ ఉన్నతికి విశ్రాంత సైనికులు భాగస్వాములు కావాలి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, మే 18 (ఆంధ్రజ్యోతి) : సమాజ ఉన్నతికి విశ్రాంత సైనికులు భాగస్వాములను చేసి వారికి ఉద్యోగ అవకాశాలను కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరతానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆదివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో పలువురు విశ్రాంత సైనికులు ఎమ్మెల్యే వెనిగండ్లను కలిసారు. ఈ సందర్భంగా వారితో ఎమ్మెల్యే వెనిగండ్ల పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మీలో పనిచేసి రిటైరైన వారి కష్టాలు తనకు తెలుసన్నారు. తన తండ్రి వెంకటేశ్వరరావు ఆర్మీలో పని చేశారని, తాను స్వయంగా వాటిని చూశానన్నారు. దేశరక్షణలో విశేష సేవలందించి ధైర్యానికి ప్రతి రూపాలైన సైనికులను అందరం ప్రత్యేకంగా గౌరవించుకోవాలన్నారు. కఠిన శ్రమతో కూడిన శిక్షణ పొంది ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించారన్నారు. రిటైరైన సైనికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకునేలా, వారి సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల పేర్కొన్నారు. ఆర్మీ విశ్రాంత సైనికులు పాల్గొన్నారు.



విశ్రాంత సైనికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

దేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పిన 'ఆపరేషన్ సిందూర్'

పామర్రు, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌పై భారతవైమానికదళం నిర్వహించిన ప్రతీకారపోరాటం దేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పిందని మొవ్వ ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం పామర్రులో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ పతాకాలను చేతబూని జైభారత్ అంటూ ఆపరేషన్ సిందూర్ జిందాబాద్ అనే నినాదాలు చేస్తూ విజయవాడ రోడ్డు నుంచి స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్‌పై ప్రధాని మోదీ తీసుకునే ప్రతినిర్ణయానికి ప్రజానీకం మద్దతు ప్రకటిస్తుందన్నారు. పర్యాటకులపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులను పాక్ అప్పగించాలని డిమాండ్ చేశారు. ఆక్రమిత స్థలాన్ని ఖాళీ చేశాకే చర్చలకు దిగాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు ముదునూరు శివకృష్ణ , యార్లగడ్డ రమేష్ మట్టా మోహనరావు, ఉరిమి శ్రీకాంత్, బడే కేశవరావు, డి.రాకేష్ , కమల కుమారి యువమోర్చా హనుమన్, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న నేతలు



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న కమిటీ సభ్యులు

ఆర్థిక సాయం

గుడ్లవల్లేరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు లయన్స్ వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పనుల కోసం స్థానిక నెహ్రూ పశువుల సంత , గ్రామాభివృద్ధి సంఘం వారిచే ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పనుల కోసం వాకర్స్‌కు రూ. 15000 లు వాకర్స్ ప్రతినిధి చాపరాల సుధాకర్‌కు ఈ మెత్తాన్ని సంత కమిటీ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో సంత కమిటీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమామహేశ్వరరావు, సభ్యులు వల్లభనేని వరప్రసాదరావు, కుసం.కోటేశ్వరరావు, కొసరాజు నారాయణ ప్రసాద్, యలమంచిలి రామకోటేశ్వరరావు, కుంచపర్తి ప్రభాకరరావు, పొట్లూరి రవికుమార్, పోలవరపు వెంకటరావు, కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు పాలన దేశానికే ఆదర్శం

● ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు



మృతిచెందిన కార్యకర్తలకు మినీ మహానాడు వేదికపై సంతాపం తెలియజేస్తున్న నాయకులు

తోట్లవల్లూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుపాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పేర్కొన్నారు. గరికపర్రులో ఆదివారం రాత్రి మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో పామర్రు నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడు నిర్వహించారు. ముందుగా ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనందుకు జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ నిర్వహించి, సైన్యానికి సంఘీభావం తెలిపారు. అనంతరం జరిగిన సభలో కొనకళ్ల మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15 నుంచి ఆర్టీసీల్లో మహిళలకు ఉచిత బస్సుప్రయాణం కల్పిస్తున్నామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అధ్యక్షత వహించి మాట్లాడుతూ 11 నెలల పాలనలో రూ. 152 కోట్లు తీసుకువచ్చి వివిధ రంగాల్లో అభివృద్ధి పనులు చేశామన్నారు. నియోజకవర్గంలోని సమస్యలను, వివిధ వర్గాల నుంచి అందిన తీర్మానాలను ఈ మినీ మహానాడులో ఆమోదించి మహానాడులో అందిస్తామన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు శివరామ్ వ్యయప్రయాసలకోర్చి మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. ఈ మహానాడులో నాయకులు వీరపనేని శివరామ్‌ప్రసాద్, చాగంటి తిమ్మారెడ్డి, వల్లూరుపల్లి గణేష్, ఘైనేని ఇందిర, చౌదరి, ప్రవీణ్‌చంద్ర, రాజా, వెంకటేశ్వరరావు, శివశంకర్, శ్రీనివాసరావు, వెంకట సుబ్బయ్య, గోపాలకృష్ణ , నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మొక్కుబడులు చెల్లించుకుంటున్న భక్తులు

ముగిసిన అంకమ్మ దేవర మహోత్సవం

కూచిపూడి, మే 18 (ఆంధ్రజ్యోతి): మొవ్వలో రెండ్రోజులుగా కొనసాగుతున్న తాతినేని వారి అంకమ్మ దేవర మహోత్సవ సంబరాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సంబరాలకు రెండు తెలుగు రాష్ట్రాల్లో స్థిరపడిన తాతినేనివారి కుటుంబీకులే కాకుండా ఆడపడుచులు సైతం గ్రామానికి తరలి వచ్చి సంబరాల్లో పాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయం నుంచి పుట్టింటికి వచ్చిన అమ్మవారి ఘటంతోనూ, పోతురాజు గడతో డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం మొక్కుబడులు తీర్చుకుని అన్నసమారాధన నిర్వహించారు. అందరూ ఒక్కచోట చేరి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు.

పశుదాణా పంపిణీ నేడు

గుడ్లవల్లేరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులోని పశువైద్యశాలలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం 50 శాతం రాయితీతో అందించే పశుదాణా పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నామని పశుసంవర్థకశాఖ ఏడీ ఎ.లక్ష్మీనారాయణ తెలిపారు. గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్ చేతులమీదుగా సోమవారం ఉదయం పంపిణీ చేయనున్నామని ఆయన తెలిపారు.



గరికపర్రు బయలుదేరి వెళ్తున్న నేతలు

మినీ మహానాడుకు తరలిన టీడీపీ శ్రేణులు

పెదపారుపూడి, మే 18 (ఆంధ్రజ్యోతి): గరికపర్రు సాయి కల్యాణ మండపంలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అధ్యక్షతన ఆదివారం మినీ మహానాడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెదపారుపూడి మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు చ లసాని రమేష్ చౌదరి తెలిపారు. ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, చిలక అంజనేయులు, నత్తా వాణిలు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

గుడివాడ, మే 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్టీఆర్ కాలనీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఎన్టీఆర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నాదెండ్ల వెంకట కృష్ణవేణి జ్ఞాపకార్థం ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో విజయవాడ ఐ కేర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ అజయ్, డాక్టర్ శోభారాణిల బృందం ఆధ్వర్యంలో 120మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం 42మందికి కళ్లజోళ్లను అందించారు. స్థానిక గౌరీశంకరపురంలోని విస్తా సూపర్ స్పెషాలిటీ డయాగ్నోస్టిక్స్ వారు ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, బీజేపీ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, దాత లింగం చిట్టిబాబు, క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు కోన రామారావు, దిమ్మిటి శ్రీనివాస్, కోశాధికారి తమ్మినేని రామ్మోహన్, బొప్పన కుటుంబరావు, మెరుగుమాల శివరామకృష్ణ, సత్యనారాయణ, శ్రీవిష్ణు, అర్జా ప్రసాద్, వీరయ్య, మసిముక్కు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



మరమ్మతుల అనంతరం వంతెన

వంతెనకు మరమ్మతులు

పమిడిముక్కల, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఊరికి చేతనైన మేర ఉపయోగపడేందుకు మేము సైతం అం టూ పెనుముత్స గ్రామసర్వీస్ ట్రస్టు సభ్యులు ముందుకు వచ్చి మొవ్వ రోడ్డులో పెద్ద కాల్వ వంతెనకు రూ. 36వేల ఖర్చుచేసి మరమ్మతులు చేయించి ఆదర్శంగా నిలిచారు. మొవ్వ రోడ్డులో పెద్దకాల్వ మీద వంతెన పూర్తిగా పాడైపోయి శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఎప్పుడు కూలుతుందోనన్న భయంతో వాహనదారులు వంతెనపై రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఈ వంతెనకు మరమ్మతులు చేయించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. రైతుల కోరిక మేరకు వంతెనకు మరమ్మతులు చేయించడంతో సర్వీసు ట్రస్టు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణ మహోత్సవం



కల్యాణ దంపతులుగా ముస్తాబైన స్వామి, అమ్మవార్లు

కూచిపూడి, మే 18 (ఆంధ్రజ్యోతి): పెడసనగల్లులోని లక్ష్మీపద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవ వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత ఉత్సవ మూర్తులను కల్యాణ దంపతులుగా నూతన వస్త్రాలతో అలంకరించారు. కార్యక్రమాల్లో భాగంగా కుంభారాధన, నిత్య హోమం, చతుర్థ కలశ స్నపన, బలిహరణ కార్యక్రమాలను నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ సాంప్రదాయ రీతిలో తిరుకళ్యాణ వేడుకలు జరిగాయి. ఆలయ అర్చకులు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు సహకారంతో దివి ఉదయ్ కుమార్ అయ్యంగార్ ఈ వేడుకలను అశేష భక్తుల నడుమ నిర్వహించారు.

కూలిన విద్యుత్ స్తంభం

గుడివాడ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): వలివర్తిపాడు రోడ్డులో గూడెంరోడ్డు దాటాక కరెంట్ స్తంభం పంట బోదె వైపు వాలిపోయింది. ఎప్పుడు ఏమౌతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని సరి చేసి రైతులు ప్రమాదాల బారిన పడకుండా కాపాడాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

వన్నేరు డ్రెయిన్ గండి పూడ్చివేత

పెదపారుపూడి: దాతల సహకారం మరువలేనిదని నీటి సంఘం మాజీ అధ్యక్షుడు బోయిన సాంబశివరావు అన్నారు. మోపర్రు శ్మశానానికి వెళ్లే దారి వద్ద గల వన్నేరు డ్రెయినేజీ గండిని ఆదివారం పూడ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వచ్చిన వరద నీటికి మట్టి కొట్టుకుపోయి డ్రెయిన్‌కు గండి పడిందన్నారు. దీంతో మోపర్రుకు చెందిన సీతమ్మరాజు రామారావు (రాము) రూ.40 వేల తన సొంత నిధులతో గండిని పూడ్చారన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



పామర్రులో సామూహిక పుస్తక పఠనం గురించి వివరిస్తున్న గ్రంథాలయాధికారి సురేష్

పామర్రు, మే 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని గ్రంథలయాధికారి ఎం. ఝాన్సీరాణి పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా చిన్నారులకు ఆదివారం పలు క్రీడల పట్ల అవగాహన కల్పించారు. ఆటల వల్ల శారీరక, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడారంగాల్లో దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన క్రీడాకారుల్ని ఆదర్శంగా తీసుకుని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. అనంతరం చెస్, క్యారమ్స్ పోటీలను నిర్వహించారు. ఇదే విధంగా జమీగోల్వేపల్లి గ్రంథాలయంలో చిన్నారులకు గ్రంథాలయాధికారి వి.సురేష్ పుస్తక పఠనం ఆవశ్యకత గురించి వివరించారు కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పెదపారుపూడి: వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా ఆదివారం పెదపారుపూడి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటలు - మేథో వికాసం అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఎం.వి.ఎస్.లక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థుల శారీరక, మానసిక ప్రభావం చదువుపై ప్ర భావం చూపుతుందన్నారు. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యార్థులలో అభ్యాసనా నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయన్నారు. తద్వారా విద్యార్థులు ఉన్నతమైన విద్యా ప్రమాణాలు సాధించగలరని తెలిపారు. యలమర్రు శాఖా గ్రంథాలయంలో కథలు, సామెతలు, పొడుపు కథలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి జె.విజయలక్ష్మి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పెదపారుపూడిలో శిక్షణా తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

మచిలీపట్నం

• మచిలీపట్నం • పెడన • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 535	



శేషుబాబు సేవలు మరువలేనివి : రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : మాజీ కౌన్సిలర్ మోదుమూడి శేషుబాబు సేవలు మరువలేనివని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శేషుబాబు సంతాప సభ ఆదివారం రెండో డివిజన్‌లోని ఆయన ఇంటి వద్ద జరిగింది. మంత్రి కొల్లు రవీంద్రతో పాటు మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నాయకులు మరకాని పరబ్రహ్మం తదితరులు పాల్గొని శేషుబాబు చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన సేవలను గుర్తు చేశారు.



సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో భక్తుల రద్దీ

● రుసుముల ఆదాయం రూ.10.33 లక్షలు

మోపిదేవి, మే 18 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావటంతో వివిధ సేవా రుసుములు కింద ఒక్కరోజులోనే రూ.10,33,719 ఆదాయం వచ్చినట్లు ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.



బహుమతులందజేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

క్రికెట్ విజేతలకు బహుమతి ప్రదానం

గూడూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆదివారం బహుమతులు అందజేశారు. గూడూరు హైస్కూల్‌లో జరిగిన టోర్నమెంట్‌లో మొదటి బహుమతి రూ. 20 వేలు గూడూరు జట్టుకు జనసేన తరపున, రెండో బహుమతి రూ. 15 వేలు కంచాకోడూరు జట్టుకు వాడవల్లి బ్రదర్స్, మూడో బహుమతి రూ. 10 వేలు మల్లవోలు జట్టుకు పులివర్తి బ్రదర్స్ నాల్గవ బహుమతి రూ.5 వేలను కోకానారాయణపాలెం జట్టుకు దాసరి హనుమ అందజేశారు. డీసీ చైర్మన్ పోతన స్వామి, జనసేన మండల అధ్యక్షుడు దాసరి ఉమా సాయిరామ్, పోతన రామోజీ, ఎస్ఏ బేగ్, పుప్పాల సురేష్, బాసంశెట్టి విజయ్, రాసంశెట్టి దుర్గారావు, టోర్నమెంట్ నిర్వాహకులు అప్పికట్ల పవన్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి సమ్మెను జయప్రదం చేయండి

ఘంటసాల, మే 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం తీసుకువచ్చే నాలుగు లేబర్ కోడ్‌లను నిరసిస్తూ ఈ నెల 20న మండల కేంద్రం ఘంటసాలలో జరిగే ఆందోళనలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా పిలుపునిచ్చారు. ఆందోళన కరపత్రాలను కార్మికులకు అందజేశారు. వృత్తిదారుల సంఘ జిల్లా నాయకులు వాకా రామచంద్రరావు, కౌలు రైతు సంఘం మండల నాయకులు మేడంకి వెంకటేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

చలో విజయవాడకు ఆన్‌డ్యూటీ మంజూరు

మచిలీపట్నం టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : సమస్యలపై చర్చించేందుకు జూన్ 5న విజయవాడలో నిర్వహించే చలో విజయవాడకు ఉద్యోగులకు ఆన్‌డ్యూటీగా ప్రభుత్వం మంజూరు చేసిందని జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి. రాము తెలిపారు. కలెక్టరేట్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో రాము మాట్లాడారు. విజయవాడలో రాష్ట్ర నాయకులు కె.ఆర్. సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరగబోయే ప్రభుత్వ ఉద్యోగుల సమావేశానికి పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తీసుకువెళ్లాలన్నారు. టి. వరప్రసాద్, కె.వి. లోకేష్, జి. శ్రీనివాస్, కె. కోటేశ్వరరావు, సిహెచ్. పవన్‌కుమార్, సుమన్, కోశాధికారి సురేష్‌నాయక్, చంద్రమోహన్, పరమేశ్వరరావు, జి. నాగరాజు, ఎం. సముద్రేశ్వరరావు, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

కంటి జాగ్రత్తలు తీసుకోవాలి

మచిలీపట్నం టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ కంటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో రుస్తుంబాద బాలికోన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని గోపీచంద్ ప్రారంభించారు. డివిజన్ టీడీపీ నాయకుడు మంచాల రాంబాబు ఆధ్వర్యంలో రోగులకు మందులు, కళ్లజోళ్ల పంపిణీ చేశారు. శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తామన్నారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, పి.వి. ఫణికుమార్, నల్లూరి మురళీకృష్ణ, రాంబాబు, అయినాల లక్ష్మణరావు, చలమలశెట్టి రమేష్, రామినాయుడు పాల్గొన్నారు.

భవానీ ప్రసాద్‌కు ఆళ్ల పరామర్శ



ఘంటసాల, మే 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య మాజీ అధ్యక్షుడు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ వీరమాచినేని భవానీ ప్రసాద్ ఇటీవల కాలుకు శస్త్రచికిత్స చేయించుకొని దాలిపర్రులోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు ఆదివారం దాలిపర్రు విచ్చేసి ఆయనను కలసి పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. 1997లో సాగునీటి సంఘాల వ్యవస్థ తొలిసారిగా ఏర్పడినప్పుడు వ్యవస్థ గురించి వీరమాచినేని భవాని ప్రసాద్ ఎంతో మందికి అవగాహన కల్పించి, రైతుల భాగస్వామ్యం కోసం విశేషంగా కృషి చేశారని గుర్తు చేశారు.



దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరికి సత్కారం

అవనిగడ్డ, మే 18 (ఆంధ్రజ్యోతి) : దివి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన కొల్లూరి వెంకటేశ్వరరావును ఎడ్లంక గ్రామస్థులు ఆదివారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఎడ్లంక గ్రామానికి చెందిన దళిత సంఘాల నేతలు మునిపల్లి వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, బందెల ఏసేపు, నలుకుర్తి వెంకటేశ్వరరావు, మునిపల్లి వెంకటేశ్వరరావు, కైతేపల్లి సురేష్, కోటేశ్వరరావు, నానిబాబు, మునిపల్లి సువర్ణరాజు, నలుకుర్తి ముని తదితరులు విచ్చేసి ఆయనను ఘనంగా సత్కరించారు.

బందరులో భారీ వర్షం

● డ్రెయిన్లలో పూడికతీయక మునిగిన రోడ్లు

మచిలీపట్నం టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : బందరులో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఎండ తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలు వర్షంతో కొంత సేద తీరారు. భారీ వర్షం పడటంతో పట్టణంలోని పలు రోడ్లు ముంపునకు గురయ్యాయి. పాదచారులు, ఫుట్‌పాత్ వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు. డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించిన మున్సిపల్ అధికారులు డ్రెయిన్లలో పూర్తిస్థాయిలో పూడిక తీయకపోవడం వల్లే రోడ్లు ముంపునకు గురయ్యాయని ప్రజలు తెలిపారు. వేసవిలో పూర్తిస్థాయిలో డ్రైనేజీలలో పూడిక తీస్తేనే నగరం ముంపుబారి నుంచి బయటపడుతుందని సీనియర్ సిటిజన్లు అన్నారు. కొద్దిపాటి వర్షానికి ఎప్పుడూ ముంపునకు గురయ్యే కోనేరుసెంటర్‌లో ఆదివారం కురిసిన వర్షానికి నీరు నిలవక పోవడం గమనార్హం.



గొడుగుపేటలో ముంపునకు గురైన రోడ్డు



కన్యకా పరమేశ్వరి గుడి ఎదురుగా రోడ్డుపై వర్షపు నీరు

మినీ మహానాడుకు మోపిదేవిలో విస్తృత ఏర్పాట్లు

మోపిదేవి, మే 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ స్థాయి మినీ మహానాడుకు మోపిదేవిలో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. నియోజకవర్గాల్లో నిర్వహించాల్సిన మినీ మహానాడు అవనిగడ్డ నియోజకవర్గ స్థాయిలో మోపిదేవిలో ఈ నెల 19వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. 19వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయని మండల టీడీపీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు తెలిపారు. ఒంగోలు జాతి ఎద్దుల అందాల పోటీలు, బండలాగుడు పోటీలు 4 గంటల నుంచి ప్రారంభమవుతాయన్నారు. పురుషుల కబడ్డీ పోటీలు, వివిధ ప్రాంతాల కళాకారులచే నందమూరి తారక రామారావు ఏకపాత్రాభినయం, కూచిపూడి, భరత నాట్యం ప్రదర్శనలు జరుగుతాయన్నారు. సాయంత్ర 6 గంటల నుంచి మినీ మహానాడు సభా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. నాయకులు, కార్యకర్తలకు ఏ విధమైన అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. రావి నాగేశ్వరరావు, సజ్జా చలపతిరావు, చందన రంగారావు, దిడ్ల జానకి రాంబాబు, కొల్లి మురళీకృష్ణ, కొమ్ము పవన్ కుమార్, రావి రత్నగిరి, బల్లా సీతారామ ప్రసాద్ తదితరులు ఏర్పాట్లు పరిశీలించారు. నాగాయలంక : మోపిదేవిలో జరిగే నియోజకవర్గ మినీ మహానాడులో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనితెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథులుగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆర్టీసీ చైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు పాల్గొంటారన్నారు. కార్యకర్తలు, నాయకులు, క్లస్టర్ల ఇన్‌చార్జ్‌లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, రాష్ట్ర, జిల్లా స్థాయి, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కోడూరు : మోపిదేవిలో జరిగే మినీ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మోపిదేవిలో జరిగే మినీ మహానాడులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



సభా ప్రాంగణంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న పార్టీ నేతలు

మినీ మహానాడు విజయవంతం చేయండి

● మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలలో జరిగే పార్టీ సమావేశాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపు నిచ్చారు. అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశాల్లో పార్టీ సంస్థాగత ఎన్నికలు జరుగుతాయన్నారు. కష్టపడి పనిచేసే వారికి పదవులు దక్కుతాయన్నారు. కడపలో ఈనెల 27, 28, 29 జరగనున్న మహానాడు కార్యక్రమానికి ముందు 23న మచిలీపట్నంలో సత్య కన్వెన్షన్ హాలులో జిల్లా స్థాయి మినీ మహానాడు, 21న గోల్డ్‌కన్వెన్షన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి జరుగుతాయని, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. మచిలీపట్నం మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, చిన్నాపురం గ్రామ సర్పంచ్ కాగిత గోపాలరావు, మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, మాజీ వైస్ చైర్మన్ పంచపర్వాల కాశీవిశ్వనాథం, నాయకులు అక్కుమహంతి రాజా, తలారి రాంబాబు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు లంకే వెంకటేశ్వరరావు, గనిపిశెట్టి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో మే పుష్పం కనువిందు



ఘంటసాల, మే 18 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం గ్రామంలో లక్ష్మీ శ్రీనివాసరావు ఇంటిలో మే పుష్పం వికసించింది. పాపవినాశనం గ్రామ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఆదిరాల లక్ష్మీ శ్రీనివాసరావు నాటిన మొక్కకు మే పుష్పాలు వచ్చాయి. కనువిందు చేస్తున్న మే పుష్పాన్ని ఆసక్తిగా ప్రజలు తిలకించారు.

అవనిగడ్డ, గూడూరులో తిరంగా ర్యాలీ

అవనిగడ్డ, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్ విజయవంతాన్ని కీర్తిస్తూ కూటమి నేతలు అవనిగడ్డలో ఆదివారం సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహించారు. డిగ్రీ కళాశాల క్రీడామైదానం వద్ద నుంచి ప్రారంభమైన తిరంగా ర్యాలీ కోర్టు సెంటర్ వరకు జరిగింది. వీరమరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, బీజేపీ నేతలు జి.వి.నగరాయులు, టివి.గిరి, గుడిసేవ విష్ణు ప్రసాద్, విజయలక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, తెలుగుదేశం నేత బచ్చు రఘునాథ్, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, రాజనాల వీరబాబు, చెన్నగిరి సత్యనారాయణ పాల్గొన్నారు. **గూడూరు** : ఆపరేషన్ సిందూర్ విజయవంతం నేపథ్యంలో గూడూరులో ఆదివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, డీసీ చైర్మన్ పోతన స్వామి, దాసరి ఉమా సాయిరామ్, పోతన రామోజీ, పుప్పాల సురేష్, ఎస్ఏ బేగ్, బాసంశెట్టి విజయ్, ఆర్.దుర్గారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.



అవనిగడ్డ తిరంగా ర్యాలీలో కూటమి నేతలు



గూడూరు తిరంగా ర్యాలీలో పాల్గొన్న కాగిత

జేఈఈ అడ్వాన్స్‌కు 84 మంది హాజరు

పెడన రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో జేఈఈ అడ్వాన్స్ - 2025 ఆదివారం ప్రశాంతంగా జరిగింది.

ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్ట్‌లలో 85 మంది అభ్యర్థులకు 84 మంది పరీక్షలకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ బిఆర్ఎస్ రెడ్డి తెలిపారు.

జైహింద్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మచిలీపట్నం టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం జైహింద్ హైస్కూల్ 1999-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం రాధాదేవి కన్వెన్షన్ హాలులో జరిగింది. పూర్వ విద్యార్థులు పరస్పరం కుశల ప్రశ్నలు వేసుకుని మధురజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు మంగయ్య, కోదండపాణి, దీక్షితులు, స్వర్ణలత, శ్రీబాల, శ్రీకళ, రజియా బేగం, పూర్వ విద్యార్థి దేవదాయ శాఖాధికారి హరి, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ గంగాధర్, అప్పలరాజు, విజయ్, ప్రభాకర్, డిఆర్‌డిఓ క్రాంతికుమార్, మురళి, పండరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1999-2000 బ్యాచ్ జైహింద్ సెకండరీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



ఘంటసాల, మే 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వి.రుద్రవరం గ్రామానికి చెందిన వీర్ల నాగరాజుకు రెండు కిడ్నీలు పాడై తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించి పలువురు ఆదివారం నాగరాజుకు ఆర్థిక సాయమందించారు. యండకుదురు ఎంపీటీసీ సభ్యుడు సిద్ధినేని కుమార్ రాజా రూ.3 వేలు, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు సుగ్గన పవన్ కుమార్ రూ.2 వేలు, కలిదిండి రిటైర్డ్ ఎంఈవో పిడుగు ప్రభాకర్ బాబు రూ.3 వేలు ఆర్థిక సాయమందించారు. దాతలకు నాగరాజు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సూర్యనారాయణ స్వామి శాంతికల్యాణం

అవనిగడ్డ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : వేకనూరులో సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. తుంగల వీర వసంతరావు - ఇందిరాదేవి దంపతులు, తుంగల నాగ సంపత్ కుమార్ - లక్ష్మీ శిరీష, పుత్రిక యజ్ఞ శ్రీనిక, పుత్రుడు విరాజ్ కల్యాణం జరిపించారు. బండ్రెడ్డి ఉమా - పావని సాయి దంపతుల ఆర్థిక సాయంతో అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణం వీక్షించారు.

గ్రంథాలయాల్లో పిల్లలకు కథలు, పద్యాలు

మచిలీపట్నం టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : వేసవి విజ్ఞాన తరగతుల్లో విద్యార్థులకు కథలు, పద్యాలు చెప్పిస్తున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉప గ్రంథాలయాధికారి నగేష్ ఆధ్వర్యంలో కథలు వినిపించారు. అప్పినేటి పోతురాజు పద్యాలు నేర్పిస్తున్నారు. ఈడేపల్లి, చిలకలపూడి గ్రంథాలయాల్లో తరగతులు జరుగుతున్నాయి.

వైభవంగా తలశిల వారి గంగానమ్మ జాతర

నాగాయలంక, మే 18 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంక తలశిల వారి గంగానమ్మ 23వ వార్షిక జాతర మహోత్సవం ఆదివారం ఆరేపల్లి నాగరాజు సిద్ధాంతి ఆధ్వర్యంలో జరిగింది. ఉదయం అఖండ జ్యోతి ప్రజ్వలన, నైవేద్యాల సమర్పణ జరిగాయి. ఈ జాతరలో డప్పుల కళాకారులతో మాతంగి కన్య పాల్గొని సందడి చేసింది. భారీ అన్నసమారాధన జరిగింది. తలశిల వంశీయులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాట్లు పర్యవేక్షించింది.

సముద్రంలో లోతుకు వెళ్లరాదు

కోడూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : పర్యాటకులు సముద్రంలో లోతుకు వెళ్లరాదని, అటుపోట్లతో సుడులు పడి ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని మెరైన్ ఎస్సై పూర్ణ మాధురి హెచ్చరించారు. హంసలదీవి బీచ్‌కు వచ్చిన పర్యాటకులు సముద్రంలో స్నానాలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఉచిత వైద్యశిబిరాలు

చల్లపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు.

మానసిక రుగ్మతలకు డాక్టర్ శ్రావణి రోగులను పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసి కౌన్సెలింగ్ ఇచ్చారు. హోమియో వైద్య శిబిరంలో డాక్టర్ తమ్మన మణికంఠ 50 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. శిబిరాలను క్లబ్ అధ్యక్షురాలు మాజేటి అమరవాణి, దింటకుర్తి జ్యోతి, గోళ్ల ద్రోణ పూర్ణ చంద్రరావు తదితరులు పర్యవేక్షించారు.

కేన్సర్ వ్యాధిగ్రస్తులకు సాయం

మచిలీపట్నం టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : పెదకరగ్రహారం పంచాయతీ శివారు గౌడపాలెం రక్షణ కాలనీకి చెందిన క్యాన్సర్ వ్యాధిగ్రస్తురాలు కొక్కిలిగడ్డ ధనలక్ష్మితో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న పడమట లక్ష్మి, చిమటా భారతిలకు ఒక్కొక్కరికి రూ. 3వేల చొప్పున ఆదివారం రూ. 9వేల ఆర్థిక సాయం అందించారు. బత్తిన నాగరాజు, జమాల్‌బాషా, అస్గర్, పడమట సుబ్బారావు, పడమట దుర్గాప్రసాద్, బొట్ట విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వరం ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా

నాగాయలంక, మే 18 (ఆంధ్రజ్యోతి) : తీర గ్రామాల దాహార్తిని తీర్చేందుకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఉచితంగా తాగునీరు సరఫరా చేస్తున్నారు. సంగమేశ్వరం గ్రామాలకు ఆదివారం 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేశారు. మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని జనసేన నాయకులు మండలి వెంకట్రామ్ పర్యవేక్షించారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయండి

మచిలీపట్నం టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్ది బాబూరాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. బందరులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. తరగతికి 45 మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే రెండవ సెక్షన్ మంజూరు చేయాలన్నారు. విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి 1:20 తగ్గకుండా చూడాలన్నారు.





